శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీ కీ జై!

# గురుకృప

స్ఫూర్తి... పూర్తి...





శ్రీరామనవమి సంచిక



"నాకు సంబంధించినవారు మొదట అలాంటి కారణాలతోనే నా దగ్గరకు వస్తారు. వారి కోరికలు తీరి జీవితంలో సౌఖ్యం చిక్కాక, నన్ను అనుసరించి ఆధ్యాత్మికంగా పురోగమిస్తారు. నిజానికి, రకరకాల మిషలమీద నేనే వారిని నా దగ్గరకు రప్పించు కుంటాను. వారెంత దూరాన వున్నా సరే నేనే వారిని కోరి నా వద్దకు చేర్చుకుంటాను. ఎవరూ వారంతటవారుగ నా దగ్గరకు రారు!"

– శ్రీ సాయిబాబా


సంపుటి : 12
# గురుకృప
సంచిక : 2



## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీ సాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

- శ్రీ బాబూజీ



### లోపలి పేజీలలో

ఏది నామం? - ఏది రూపం? 4
- గురుకృప

మనసులోనిది... మరపురానిది... 6
- -గురుబంధువు

చక్కటి కూర్పు... సద్గురువుదీ నేర్పు 17
- సుధారఘు

సమయాన్ని సద్వినియోగం చేసుకోని కారణంగా గురుబంధువులకు 'ఉన్నమాట-అనుకున్నమాట' శీర్షికను అందించలేకపోతున్నాం. అందుకు సద్గురు చరణాల చెంత సాగిలపడి క్షమాపణలు వేడుకుంటున్నాం. ఈ పొరపాటు పూర్తిగా వ్యక్తులది.

**గురుబంధువులకు శ్రీ విరోధినామ సంవత్సర శుభాకాంక్షలు.**

నిర్వహణ : ***గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు***

**GURUKRUPA, 2-1-6, Gandhi Chowk, Tenali-01. Ph : 93933 61778**
**Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Ph : 2740222**



# ఏది నామం? - ఏది రూపం?

సద్గురురాయా! మీ రూపమే శాస్త్రాలకు ఆధారం, మీ రూపమే ధర్మానికి ఆకారం. మీ జీవనగమనమే మాకు శృతి, స్మృతి. ప్రతీ అణువు జ్ఞాన ప్రక్షిప్తమై, ప్రతీ అడుగు మాకు ఆదర్శమై, ప్రతీ పలుకు మాకు వేదవాణియై సాగే ఈ సద్గురు లీలా తరంగిణి మాలో సాయి 'స్ఫూర్తి'ని కలిగించి, 'సాయి'తో మా జీవితాలు 'పూర్తి' కావాలని ఆకాంక్షిస్తున్నాము. కేవలం మీతో ఉన్న ఋణానుబంధంతో మా వంటి జీవులను ఉద్ధరించడానికే మానుష రూపేణా మీరు రూపుదాల్చినారని మాకు అవగతమవుతోంది. సత్యమైన సాయిపథంలో సాగే మీ ఆదర్శ జీవన విధానము మాకు యోగ్యము మరియు క్షేమము. చరాచర జగత్తు నంతటిని 'సాయి' రూపంగా దర్శించే సద్గురుతత్త్వం యొక్క రూపం ... మాకు అపురూపం... నిజానికి అది రూపాలకు అతీతం.

***రూపాతీతుని రూపం... ఏమిటీ స్వరూపం...***

పుట్టగానే తల్లికి, ఆపైన తన స్వరూపమే అయిన ఈ జగత్తుకు ఆనందాన్నిస్తూ, ఆ ఆనందాన్నే గుర్తిస్తూ, తిరుగులేని ఆనందమే తానని తెలియచేస్తున్న ఆనంద స్వరూపమాయన. జగద్రక్షుని జగదానందరూపం గురించి సదా 'సాయి' ఆనందాబ్ధిలో ఓలలాడే సద్గురుమూర్తి వచనమిది. సరే! శ్రీ బాబూజీ రూపం గురించి? సందర్భమో!అసందర్భమో! ఒక చిన్న కథ గుర్తొచ్చింది. ఒకప్పుడు ముగ్గురు స్నేహితులు ఒక మార్గంలో సాగుతున్నారు. కొంతదూరం వెళ్లిన తరువాత వారికి మధుర సంగీతం వినిపించింది. వారిలో కుతూహలం పెరిగి ఆ సంగీతం వినవస్తున్న ప్రాంతానికి వచ్చారు. అక్కడ వారికి ఎత్తయిన ప్రహరీ గోడ కనిపించింది. ఆ గోడకు ఆవలివైపు అసలేం జరుగుతున్నదో చూద్దామన్న కోరిక పుట్టింది. వెంటనే వారు గోడ చుట్టూ తిరిగి వచ్చారు. వారికి గోడలో ఎక్కడా ప్రవేశ ద్వారం కనిపించలేదు. లోపలికి వెళ్లాలన్న కాంక్ష వారిలో మరింత తీవ్రమైంది. వారు ప్రయత్నించి, ఒక నిచ్చెనను సంపాదించి, ఆ గోడకు వేశారు. ముందుగా ఒకడు నిచ్చెన ఎక్కి, అటువైపు జరుగుతున్న ఆనందోత్సవాన్ని తిలకించి, ఆనందంతో పరవశించి, ఆవలివైపుకు దూకేశాడు. ఇది చూసి మిగతా ఇద్దరికీ మరింత ఆతురత కలిగింది. అటువైపు నిజంగా ఏదో అద్భుతం జరుగుతుందని అర్ధమైంది. ఈసారి రెండవవాడు పైకి ఎక్కి, అలాగే దూకేశాడు. మూడవవ్యక్తిలో కుతూహలం మరింత పెరిగింది. అతడు కూడా పైకి ఎక్కి ఆవలివైపు 'ఆనందాన్ని' పరికించాడు. చూడగానే అతడి మనసు కూడా దూకడానికి ఉరకలు వేసింది. ఒక్కక్షణం ఆలోచించాడు. "నేను కూడా దూకేస్తే ఇక్కడ ఇంత మహదానందం ఉందన్న విషయం ఇతరులకు ఎలా తెలుస్తుంది? ఇతరులు కూడా ఈ ఆనందాన్ని అనుభవించాల్సిందేనన్న సత్సంకల్పంతో క్రిందికి దిగి



ఊరిలోని వారినందరిని తోడ్కొని పోయి వారికి ఆనందాన్ని పంచి ఆనందించాడు". లోకానికి మేలు చేయాలన్న ఆకాంక్ష కేవలం అతనికి, ఆ రూపానికే ఎందుకు కలిగిందంటే "?". శ్రీబాబూజీ వంటి సమర్ధ సద్గురు స్వరూపం ఈ భువిన రూపుదాల్చిన తీరు గురించి గురుబంధువుల అభిప్రాయాలు అడిగితే "పరిపూర్ణ జీవనానికి ఆయనే మార్గదర్శి" అంటారు పాశ్చాత్యులు. "శృతి, స్మృతి, భాష, భాగవతము, పురాణము, శాస్త్రము, షట్కము, యోగము, యాగము, చరిత్ర, సాహిత్యము, పరిశోధన, పరిణామము... ఇలా చెప్పుకుంటూ పోతే ఆయన చెంత సమాధానం లభించని అంశం ఉండదంటారు పండితులు. ఆ రూపు గాంచడానికి, వారి ప్రేమ ప్రపంచంలో చోటు సంపాదించాలని తహతహలాడే జీవులెందరో! ఖండాలు దాటే వారు కొందరు, ఆయన అండగా ఉండగా సమయానికి, దూరానికి, కష్టానికి వెరవక పరుగిలిడే జీవులు మరికొందరు. సరే! మనమంతా వారిని ఇలా దర్శించుకుంటుంటే శ్రీబాబూజీ అంటారు. నేను సాయినామ సంకీర్తనలో పాల్గొనడానికి వచ్చేదీ దర్శనానికే! సహస్ర శిరస్సులతో సహస్ర నేత్రాలతో కనిపించే శ్రీ సాయి విరాట్ స్వరూపాన్నే నేను మీలో దర్శిస్తానంటారు వారు. చివరకు తేలేదేమంటే శ్రీ బాబూజీ బిడ్డల మాటల్లో గమనిస్తే ***"చిత్తశాంతిని, ఆనందాన్ని అందించే వారి సన్నిధానం సద్గురు సన్నిధానమని! సాయి అనన్య ప్రేమలో తాదాత్మ్యమై జగత్తునంతా సాయిగా దర్శించే శ్రీబాబూజీ భగవత్స్వరూపమని!"***

### *దర్శనం... సందర్శనం...*

తన గురు స్వరూపాన్ని చూడడానికై తన ప్రాణాలను కళ్లలో నిలుపుకుని సమయగతి మరచి, ఆహార స్ఫురణ విడిచి, క్షణమైనా గురురూపం నుంచి ఎడబాటును సహించలేని శ్రీసాయి- సద్గురు దర్శన ఆదర్శమై, మనిషి క్రమంగా దైవ స్వరూపునిగా రూపొందడానికై తమ జీవితాన్నే ఒక బోధగా మలచి, ఈ జగత్తును సాయి స్వరూపంగా దర్శించే శ్రీబాబూజీ - బాబాను దర్శించే విధానం మన గమ్యమై, ఎన్నో జన్మల పుణ్యఫలం, దుష్కర్మల ఫలితాలను దగ్ధం చేసేది కేవలం సద్గురు దర్శనమేనన్న శాస్త్ర వాక్యం స్మృతియై (Memory), చివరకు సద్గురువును దర్శించిన వారికి నమస్కరించినా మనం సంస్కరింపబడతామన్న సద్గురు భక్తుల జీవితాలు ప్రేరణయై, పైన చెప్పుకున్న కథలోలా మనం పొందిన ఆనందాన్ని అందరికీ పంచుతూ, మనం ఆస్వాదిస్తూ సద్గురు దర్శనాన్ని పరిపూర్ణం చేసుకోవాలని ఆకాంక్ష. సద్గురు దర్శనాన్ని క్రమేపీ మనలోని బలహీనతలను పోగొట్టుకోవడానికి, అవసరాలను, కోర్కెలను సద్గురు సంకల్పానికి, విడవడానికి గురువుపట్ల మనకున్న ప్రేమను పూర్తిగా వ్యక్తం చేసుకునేందుకు మనకు ఉన్న అడ్డు గోడలను తొలగించుకునేందుకు ఉపయోగపెట్టుకోవాలి. చివరగా ఒక్క అంశాన్ని పరికించుకుందాం.



## ‘స్వ’హితమా... పరహితమా?

సాయిలీలా కదంబంలో ‘సు’ పరిచితం – శ్రీ నానాసాహెబ్ చందోర్కర్. తాను శ్రీసాయి చెంతకు చేరడంలో ఎన్నో మలుపులు ఉన్నా ఒకసారి శ్రీసాయిని దర్శించాక, హృదయం నిండా సాయిభక్తి నింపుకున్నాక తనకు తారసిల్లిన బంధువులకు, స్నేహితులకు, ఆర్తులకే గాక ఉద్యోగరీత్యా తనకు పరిచయమున్న వారందరికి గూడ – సందర్భం కల్పించుకుని శ్రీసాయి గూర్చి స్మరించుకుంటూ ఆ మహితాత్ముని దర్శించుకొమ్మని ప్రోత్సహిస్తూండేవారు. అలాంటి వారిలో దీక్షిత్, దభోల్కర్, దేవ్, నూల్కర్, ఆయీ, దాసగణు ఇలా ఎందరో ధన్యజీవులు. శ్రీసాయిసన్నిధి ఆయా జీవులకు ఎంతో ఉపయోగపడింది. మరో కోణంలో చూస్తే ఒక వంక నానా సాయిస్మరణ చేసుకుంటుంటే, మరోవంక సాయిచెంతకు భక్తులు చేరడంలో కేవలం నానా ‘మిష’ మాత్రమే అయినా– నానాకు మాత్రం ఎన్నో విషయాలలో ఎనలేని ప్రయోజనం చేకూరింది శ్రీసాయిమహరాజ్ చెంత! విషయానికొస్తే మనం ఎవరికి హితం చేకూర్చగలం? ఎవరికైనా హితం చేకూర్చగలిగింది ఆ సద్గురుమూర్తే కదా! సద్గురు దర్శనాన్ని, భాషణాన్ని, వచనాన్ని, మార్గాన్ని, ప్రేమను, ఆదర్శాలను, జీవిత విధానాన్ని, జ్ఞానాన్ని, తృష్ణను, ప్రేమను మన సాటి వారికి పంచడం ద్వారా మనకు మనం సేవ చేసుకుంటున్నాం. వింటే కొంచెం అతిశయోక్తిగా ఉంది కదూ! మనం ఎదుటివారి కోర్కెలు సద్గురువుకు విన్నవించి, అవి తీరకపోతే ఎలా ఆలోచిస్తాం? గమనించుకుందాం! చివరగా ఒక్క విన్నపం గురుబంధువులకు, ఇంకా ఇంకా మనకు మనం సేవ చేసుకుందాం, సద్గురువు చెంత మనం పొందిన ప్రేమను అందరికీ పంచుదాం. మనసా, వాచా, కర్మణా అది మనకు ఆదర్శంగా స్వీకరిద్దాం. మన దృష్టిలో సద్గురువు ఉండడం నుంచి క్రమేణా సద్గురువు దృష్టిలో మనం ఉండే ప్రయత్నం ప్రారంభిద్దాం.

*ఈ రూప చెంతనే మాకు ధ్యానంబు!*

*ఈ నామ స్మరణమే మాకు ధ్యేయంబు!!*

# మనసులోనిది... మరపురానిది...

సాయిబాబా అనుగ్రహాన్ని అర్థిస్తూ గురుదేవుల ఆశీస్సులు గురుకృపకు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటూ, నా అనుభవాన్ని సాయి భక్తులతో పంచుకోవడం ఆనందంగా భావిస్తూ... నా దైవం (బాబా)ను నా శక్తిమేర ప్రేమించినందుకేమో... గురువును తెలుసుకో (గురువు స్వరూపాన్ని) ఎందుకు వచ్చినట్లు పిడకలు ఏరుకోవడానికా అన్న ఆయన (బాబా) మాటల్ని నాకు అవసరమైనపుడు అనుభవంలోకి వచ్చేలా చేసారు. అది ఎలాగంటే... నా జీవితంలో జరిగిన సంఘటనల ఫలితంగా గురువుగారిని



షిరిడిలో సాయియానాలో నేను చూసినపుడు అంతమందిలో ఆయన నన్ను చూసిన చూపు ఒక ప్రత్యేకమైనది. ఆ ఒక్క చూపు ద్వారా ఆయన నాకు ప్రసాదించిన నిశ్చింత, నేను దేనికోసం అయితే వెతుకుతున్నానో అది దొరికినట్లుగా... అది 2000వ సం॥ విజయదశమి. మధ్యాహ్నం గురువుగారిని సాయియానాలో ఈ రోజు ఊరికివెళ్లే వాళ్లు దర్శనం చేసుకోవచ్చు అని అనౌన్స్‌మెంట్ ఇచ్చారు. నేను మధ్యాహ్నం 1 గం॥ ప్రాంతంలో గురువుగారి పాదములకు నమస్కరించి "నాకు ఏమీ అర్థం కావడం లేదు. నన్ను భగవంతుడి మార్గంలో నడిపించండి." అని చెప్పుకున్నాను. గురువుగారు ఊది పెట్టి, ఇచ్చి శుభం అన్నారు. ఆరోజు రాత్రి గురుస్థానం దగ్గర నిలబడి ప్రదక్షిణలు చేసే వారిని చూస్తున్నాను. గాలివానగా ఉంది. ఆ సమయంలో నాకొక అనుభూతి కలిగింది. ఆ అనుభూతి ఇచ్చింది గురువుగారు అని స్పష్టంగా ఎలాంటి డౌట్ లేని విధంగా నాకు తెలిసింది. భగవంతుడి (బాబా) మార్గాన్ని బోధపడేటట్లు చేసారు గురువుగారు. ఇలాంటి అనుభవాన్ని సద్గురువు మాత్రమే ప్రసాదించగలరని రమణమహర్షి, నామదేవుని బుక్స్ మరియు ఇతర మహాత్ముల బుక్స్ చదివి తెలుసుకున్నాను.

ఒకరోజు గురువుగారు తెల్లవారుఝామున కలలో కనపడినట్లుగా కనబడ్డారు. మరుసటి రోజు గురువుగారిని చూడాలన్న తపన పుట్టింది. గురువుగారు తిరువణ్ణామలైలో ఉన్నారని తెలిసింది. గురువుగారిని చూడాలంటే అనుమతి ఉండాలని కృష్ణయ్యగారు చెప్పారు. గురువుగారిని చూడాలన్న తపన, గురువుగారు తప్పకుండా మనకు దర్శనం ఇస్తారన్న ఆశతో ఇంటిలో ఆ రోజు పనికూడా లేకుండా ఉండడం వల్ల నేను ఇంటిలో ఎవ్వరికీ చెప్పకుండా బయలుదేరాను. నాతోపాటు నా స్నేహితులు ఇద్దరు మేము కూడా వస్తామని చెప్పారు. ముగ్గురం బయలుదేరాము. తిరువణ్ణామలై ఎలా వెళ్లాలో తిరుపతిలో కనుక్కొని సుమారు రాత్రి 9 గం॥ ప్రాంతంలో తిరువణ్ణామలైలో దిగి ఆకాశానికి తగిలే విధంగా ఉన్న దేవాలయ గోపురాలను చూసి ఒళ్లు పులకరించింది. దేవాలయం ముందర రమణమహర్షి, మ్యూజియం దగ్గర భగవాన్ ఫోటో పెద్దది నన్ను ఆకర్షించింది. రమణమహర్షికి మల్లెపూలు, రోజాపూలు వేసి, భగవాన్ మేము గురుదేవులను చూడాలని ఇక్కడ ఉన్నారని ఇంటిలో చెప్పకుండా వచ్చివేసాము. ఆయన నా గురువు. నిజంగా గురువు, భగవంతుడు, గురువు భగవంతుడి మార్గంలో నడపడం నిజమైతే గురువుగారి దర్శనం కావాలి అని వేడుకున్నాను. రాత్రి సమయం గురువుగారు ఎక్కడ ఉంటారో తెలియదు. గిరి ప్రదక్షిణ మొదలుపెట్టి గిరి ప్రదక్షిణ చేసాము. గిరి ప్రదక్షిణ పూర్తవుతుందనగా శేషాద్రి స్వామి ఆశ్రమం దగ్గర ఉండే హోటల్‌లో బాబాకి నమస్కారం చేస్తూ గురువుగారు నిలబడిఉండే క్యాలెండర్ చూసాము. వాళ్లని అడిగితే గురువుగారి విషయం తెలుస్తుందని వెళ్లి అడిగాము. వాళ్లు విషయము మాకు తెలియదు, వాళ్లు (గురుబంధువులు) నేరుగా ఉండే రోడ్డు చూపి ఆవైపు నుంచి వస్తుంటారు" అని చెప్పారు. ఆ



రోడ్డువైపు వెళ్లాము. అక్కడ విచారిస్తూ యస్.టి.డి. దగ్గర విచారించాము. నేను గురువుగారి ఫోటో ఉండే రౌండ్ బ్యాడ్జి తగిలించుకుని యున్నాను. బ్యాడ్జి చూపించి యస్‌టిడి పిల్లవాడ్ని "ఈయన మా గురువుగారు ఈయన ఇక్కడ ఉంటారని తెలిసి వచ్చాము. మీకు తెలిస్తే చెప్పమని" అడిగాము. "ఈయన నాకు బాగా తెలుసు. ఈయన ఇపుడు ఇక్కడ లేరు. 4 రోజుల క్రితం మద్రాస్ వెళ్లిపోయారు". గురువుగారు తెలుసు అన్నందువల్ల ప్రాణం వచ్చినట్లయి, తిరిగి మద్రాసు వెళ్లారు అన్నదాని వల్ల ప్రాణం పోయినంత పనయింది. నిరుత్సాహం, ఎక్కడలేని బాధ, "ఈయనేనా నీకు గురువుగారు బాగా తెలుసా" అని అడిగాము, ఆ పిల్లవాడు "తెలుసు, ఇంగ్లీషు వాళ్లు కూడా ఉంటారు కదా! గురువుగారు నన్ను తట్టి బాగున్నావా అని కూడా అడిగి ఉన్నారు. నేనే వెహికల్స్ మాట్లాడి తీసుకుపోయి మద్రాసులో వదిలిపెట్టా" అని చెప్పాడు. సంతోషం మెరుపు మెరిసినట్టయింది. "నీకు గురువుగారు ఉండే అడ్రస్ తెలుసా? చెప్తావా?" అని అడిగాము. పిల్లవాడు "సరే చెపుతాను" అని అడ్రస్ మరియు ఫోన్ నెంబరుతో సహా తెలిపాడు. అక్కడ తిరువణ్ణామలైలో గురువుగారు ఉండే చోటు చూపించాడు. అక్కడకు వెళ్లాము. అక్కడ ఉన్న ఒక పెద్దాయన ద్వారా ఫోన్ చేయమన్నాము. ఆయన మద్రాసుకు ఫోన్ చేసాడు. స్వామిని చూసేదానికి ఎవరో ఆంధ్రానుండి వచ్చి ఉన్నారని చెప్పాడు. స్వామి ఉన్నారా అని అడిగారు. స్వామి ఉన్నారు, రమ్మన్నారు, అవతలి వాళ్ళు ఫోన్ చేసారని బహుశా హంసగారు అనుకొని చెప్పారు. స్వామి ఉన్నారన్నదానికి సంతోషం రమ్మని చెప్పారన్నదానికి డౌట్ వచ్చాయి. ఎందుకంటే మనం విన్నదాన్ని బట్టి ఎవర్నీ రమ్మని చెప్పరు కదా! సరే పద ఏది అయితే ఏమి గురువుగారి అడ్రస్ దొరికింది. ఇప్పుడు మద్రాస్ వెళ్లాలి. నా స్నేహితులు స్కందాశ్రమము, విరూపాక్ష గుహ చూడాలన్నారు. అరుణాచలం పైకెక్కాము. అరుణాచలం గొప్ప ఆధ్యాత్మిక స్థలం అన్న విషయం తెలిసింది. దానికి కారణం గురువుగారు ఇచ్చిన అనుభవం, అక్కడ ఎక్కువగా అనుభవానికి వస్తుంది. రాత్రి ప్రయాణం చేసి మరుసటి రోజు మద్రాసు చేరాము. సాయిబాబా ఈగిల్ గెస్ట్‌హౌస్ కనుక్కోవడం చాలా కష్టం అయిపోయింది. ఎందువల్లనంటే ఆ ఏరియాలో దిగి అక్కడ వాళ్లను అడిగాము. 10 కిలోమీటర్లు వరకు ఆ ఏరియాను అదే విధంగా పిలుస్తారని చెప్పారు. కనుక్కోవడం కష్టం అని చెప్పారు. గుండెల్లో రాయి పడ్డట్టు అయ్యింది. వీలయినంత వరకు ఫోన్ చేయకూడదని మా అభిప్రాయం. ఎందువల్ల అంటే ఫోన్ చేస్తే నరేంద్ర అన్న ఉంటారు. ఆయన ఎవరో మనకు తెలియదు, ఆయనకు మనం తెలియదు కాబట్టి అనుమతి ఇవ్వరేమో? గురువుగారికి అయితే మనం తెలుసు. ఆయనయితే తప్పకుండా దర్శనం ఇస్తారు. కాబట్టి ఎలాగైనా వెతికి అడ్రస్ కనుక్కోవాలి. ఉదయం కాలకృత్యములు తీర్చుకుని టీ తాగాము. అక్కడ విచారిస్తే కొంతదూరంలో సాయిబాబా ఆశ్రమం లాంటిది ఒకటి ఉందని చెప్పారు. అక్కడకు వెళ్లాము. అక్కడ బయట వున్న వాళు ఒక స్వామి లోపల ఉంటాడని చెప్పారు. సాయిరాం అన్న బోర్డు, స్వామి కాషాయ వస్త్రాలు ధరిస్తారని



చెప్పారు. లోపలకు వెళ్లకుండా ఆయనకాదు అనుకొని వచ్చేసి వెతుకుతున్నాము. విచారించగా 5 కి॥మీ॥ దూరంలో సాయిబాబా మందిరం ఉందని చెప్పారు. అక్కడ విషయం ఏమైనా తెలుస్తుందేమోనని అక్కడకు వెళ్లాము. ద్వారం దగ్గర గుర్ఖా ఉన్నాడు. నా షర్ట్‌కున్న బ్యాడ్జి చూపించి "ఈయన కోసం వచ్చాము. ఈయన మా గురువుగారు, లోపల ఉన్నారా?" అని అడిగాము. అతని హిందీలో "హై అందర్ హై, జావ్" అని చెప్పాడు. అబ్బా సంతోషం కట్టలు త్రెంచుకుంది. గురువుగారు దొరికిపోయారు! లోపలికి వెళ్లాము. మా సంభాషణ గమనిస్తూ ఉన్న లోపల సాయిబాబా మందిరంలో టెంకాయల షాపు పెట్టుకుని ఉన్న ఒక ఆమె పిలిచింది. 'మీకు ఏం కావాలి?' ఆమె తెలుగు మాట్లాడుతుంది. తమిళనాడులో తెలుగుభాష వినిపించేసరికి సంతోషం, ఈమె గురువుగారి గురించి చెప్పదేమో అన్న అనుమానం భయం భయంగా నా షర్టుకు ఉన్న బ్యాడ్జి చూపించి "అమ్మా ఈయన మా గురువుగారు ఈయనను చూడడానికి వచ్చాము". ఆమె 'ఈయనా? ఈయన ఎక్కడున్నారు'? మేము ఊహించినట్లుగా అబద్ధం చెపుతుంది. 'అట్లా అనకండమ్మా గురువుగారు లోపల ఉన్నారని గూర్ఖా చెప్పాడు'. 'వాడా! వాడిమొహం వాడికేమి తెలుసు? బ్యాడ్జిలో బాబా కూడా ఉంటారు కదా అది చూసి లోపల బాబా ఉన్నారు అని చెప్పి ఉంటాడు. మాది విజయవాడ నేను ఈయన్ని చూడాలని ప్రయత్నం చేస్తున్నా, షిరిడిలో ఉంటారని నేను షిరిడికి వెళ్లినపుడు ఆయన్ను చూడాలంటే కుదరలేదు. మాస్టారి గారి దగ్గర ఉన్నపుడు ఒకసారి చూసాను. తరువాత చూడాలని ప్రయత్నం చేస్తావుంటే దొరకడం లేదు. ఈయన ఇక్కడ ఉంటారని మీకు ఎవరు చెప్పారు'?. తిరువణ్ణామలై వెళ్లిన విషయం అడ్రస్ విషయం చెప్పాము. ఫోన్ నెంబరు బయటపెట్టక తప్పలేదు. ఆమె ఫోన్ చేసి కరెక్ట్ అడ్రస్ కనుక్కొంది. అవతలి అతను చెప్పాడు. ఆమె అర్థం అయినంత వరకు అర్థం చేసుకొని వాళ్ల అబ్బాయికి ఫోన్ చేసింది. రమ్మనమని చెప్పింది. అతను ఇంటి దగ్గర నుంచి వచ్చేలోపల మేము సాయిబాబా మందిరంలోకి వెళ్లి బాబాని దర్శించుకున్నాము. అది చాలా పెద్ద మందిరం. గురువుగారిని చూపించమని బాబాకు మొర పెట్టుకున్నాం. ఇంటిలో చెప్పకుండా బయలుదేరి ఈరోజుకి 3వ రోజు "బాబా చూపించు" అని ప్రార్థించాము. ప్రసాదంగా పులిహోర, పొంగలి రెండు కప్పులు ఇచ్చారు. టైమ్ ఉ॥11గం॥లు అయింది. టిఫిన్ తినలేదు కాబట్టి ఆకలికి ప్రసాదాలు బాగా ఉపయోగపడ్డాయి. తిని షాపు ఆమె దగ్గరకు వచ్చాము. ఆమె కొడుకు వచ్చాడు. ఆ అబ్బాయికి ఆమె అడ్రస్, ఏరియా చెప్పింది. అతను మమ్మల్ని తీసుకుని ఆ ఏరియా చూపెట్టి, మీరు చూసుకోండి, నేను అర్జంటుగా వెళ్లాలి అని వెళ్లిపోయాడు. ఒక విషయం చెప్పడం మరిచాను. షాపు ఆమె చెప్పింది. మీరు నాకు ఫోన్ చేసి ఆయన ఉండే అడ్రస్ చెప్పండి. రాత్రికి వచ్చి నేను దర్శనం చేసుకుంటాను, ఆయనను షిరిడిలో చాలాసార్లు మిస్సయ్యాను. నేను వెళ్లినపుడు ఆయన వెళ్లిపోయి ఉంటారు అని చెప్పింది. సరే అని మాట ఇచ్చి వున్నాము.



మేము అడ్రస్ ప్రకారం కనుక్కొని గెస్ట్‌హౌస్ నంబరు కూడా ఫోన్‌లో చెప్పి వుండడం వల్ల ఇంక ఇప్పుడు గురువుగారిని చూడబోతున్నామని సంతోషంగా వెళ్లి ఎలాగో కనుక్కోగలిగాము. ఆ గెస్ట్‌హౌస్ దగ్గర గురువుగారు ఉన్న వాతావరణం కనబడలేదు. ఒక మగఅతను, ఆడ ఆమె పనివాళ్లలా ఉన్నారు. మగ అతనిని ప్రశ్నించాము. ఆయన తమిళం, మేము తెలుగు మొదలే టెన్షన్స్. వాళ్లే ఆ గెస్ట్‌హౌస్ దగ్గర ఉంటామని చెప్పారు. అతను వాచ్‌మేన్ అట. సరే భాష అర్థం కావట్లేదు. ఇక్కడ ఒక స్వామి ఉన్నారని చెప్పారు. ఫోన్ చేసింది నేనేనని చెప్పాడు. ఒక్కసారి గుండె ఆగినంత పని అయ్యింది. ఆయనను తీసుకొని తెలుగు తెలిసిన వారి దగ్గరకు తీసుకుపోయి అడిగాము. నిన్న తిరువణ్ణామలై నుంచి ఫోన్ చేసాము. ఫోన్ నెంబరు చూపించాము. ఇంక ఏముంది. ఆ ఫోన్ నెంబరు వాళ్ల గెస్ట్ హౌస్‌దేనని నిన్న ఫోన్ చేసి స్వామి ఉన్నాడు రమ్మనమని చెప్పింది అతనే అని, తెల్లారి షాప్ ఆమె ఫోన్ చేసినపుడు మాట్లాడింది కూడా అతనే అని చెప్పాడు. స్వామి ఎక్కడ ఉన్నారు అని అడిగాము. అతను దగ్గరలో ఉన్న రామకృష్ణ ఆశ్రమములాంటిది చెప్పాడు. ఒక్కసారిగా అతన్ని చూస్తుంటే కొట్టాలన్నంత పని ఇప్పుడు ఫోన్ నెంబరు (తప్పు) లేదు, బ్రహ్మాస్త్రంపై వున్న ఆశ అడియాస అయింది. సాయిబాబా ఈగిల్ గెస్ట్‌హౌస్ ఒక్కటే ఆధారం. టైమ్ 12.30 రామకృష్ణ ఆశ్రమం దగ్గరకు వెళ్లాము. వాళ్లు మాకు తెలియదు అన్నారు. అలాంటి వారు ఎవ్వరూ లేరన్నారు. కాళ్లు పీకుతున్నాయి. మంచినీళ్లు తాగాలన్న ఆలోచన కూడా లేకుండా ఉంది. టౌన్ బస్ ఎక్కాము. మొదట కాదు అనుకొనిన సాయిరాం నిలయం అన్న ఆశ్రమం వద్దకు వెళ్లాము. అక్కడ దిగి లోపలకు వెళ్లాము. అక్కడ ఆయనను దర్శించుకునేందుకు కొన్ని కార్లు, కొంతమంది జనం ఉన్నారు. మమ్మల్ని వారు “ఎక్కడి నుండి వచ్చారు? ఆంధ్ర నుంచి, స్వామి కూడా ఆంధ్ర ఆయనే. సాయిబాబా శిష్యులు” అని చెప్పారు. “మీరు కలవాలంటే మీకు పర్మిషన్ ఉందా” అని అడిగారు. కానీ గురువుగారిని మేము శిరిడీలో చూసాము. ఈయన మా గురువుగారు అని ఫోటో చూపించాము. “లోపల ఉన్నారు” అని చెప్పారు. అబ్బా! గురువుగారు లోపల వున్నారు. ఇంక ఏమి? ఆయనను చూడవచ్చు, ఆయనతో మాట్లాడవచ్చు. మన బాధ విన్నవించుకోవచ్చు. సంతోషం పట్టరాని సంతోషం. ఆయనకు వెళ్లి చెప్పాము. పర్మిషన్ ఇస్తే వెళ్తారు అని వారు చెప్పారు. నేను గురువుగారికి ఉత్తరం వ్రాసి ఆయన ఫోటో పెట్టి ఆయన పిఎ ద్వారా గురువుగారి దగ్గరకు పంపించాను. ఆయన పర్మిషన్ కోసం నేను బాబాను, గురువుగారిని ప్రార్థించుకుంటున్నాను పర్మిషన్ దొరకాలని. సుమారు 2 గం॥ల ప్రాంతంలో స్వామి పర్మిషన్ దొరికింది, మమ్మల్ని రమ్మని చెప్పారు. పట్టరాని సంతోషంతో గార్డెన్‌లోకి వెళ్లాము. అక్కడ కుర్చీలు వేసి ఉన్నారు. అక్కడ కూర్చోమన్నారు, నేనే అపోజిట్‌గా కూర్చున్నాను. కొంతమందిని మాత్రమే పంపుతున్నారు. నేను తలవంచుకుని గురువుగారిని చూస్తాము అని



మురిసిపోతున్నాను. ఫలితం దక్కినందులకు సంతోషిస్తున్నాను. అంతలో నా స్నేహితులు ఒక్కసారి అక్కడ చూడు అని చెప్పారు. తల ఎత్తి చూసాను, అక్కడ దూరంగా ఒక అతను నిలబడి ఉన్నాడు. అతనితో కొంతమంది ఏదో చెప్పుకుంటున్నారు. అది చూసి ఒక అతన్ని పిలిచి "స్వామి ఎవరు?" అని అడిగాము. అదిగో దూరంగా కనపడే అతను అని చెప్పాడు. చెప్పలేని షాక్‌కు గురి అయ్యాను. బాబాపైన, గురువుగారిపైన, భగవత్తత్వంపైన అనుమానం మొదలైంది. ఆయనను కూడా చూడకుండా లేచి వచ్చేస్తున్నాను. మా స్నేహితులు చెప్పారు "ఇంత దూరం వచ్చాము. ఇట్లా వెళ్లిపోతే ఏమి బాగుంటుంది?" అని చెప్పారు. వాళ్లు ఏమి అన్నా అనుకోని నాకు ఇష్టం లేదు. "నేను రాను" అని చెప్పాను. వాళ్లు పిలుస్తున్నారు. కనీసం నీవు ఇచ్చిన గురువుగారి ఫోటో, లెటరు ఆయన దగ్గరే ఉన్నాయి. అవి తెచ్చుకోవడానికయినా పోవాలి కదా అని తీసుకుపోయారు. నేను వెళ్లి అతనితో కూడా చాలా విసురుగా "మేము మా గురువుగారిని చూడడానికి వచ్చాము. అడ్రస్ తెలియలేదు. మీరేమో అని ఇలా వచ్చాము" అని తీవ్రంగా సమాధానం చెప్పా. ఆయన మాత్రం చాలా నెమ్మదిగా "మీ గురువుగారు ఎవరు? ఎక్కడ ఉంటారు?" అని అడిగారు. "సాయినాథుని శరత్‌బాబూజీగారు మా గురువుగారు. షిరిడీలో ఉంటారు. తిరువణ్ణామలై, చెన్నైలో ఇక్కడ ఉంటారని అడ్రస్ ఇచ్చారు. వెతుక్కుంటూ వచ్చాము". ఆయన పిఎలని పిలిచి "వీళ్లు చెప్పే అడ్రస్ ఎక్కడ  వుండవచ్చు" అని అడిగారు. ఆయన బహుశా అక్కడ వుండవచ్చు అని చెప్పారు. ఆయన దగ్గర నుండి గురువుగారి ఫోటో మరియు నేను రాసిన ఉత్తరం తీసుకుని బయలుదేరాము. మనబోటి వాళ్లకు భగవంతుడి గురించి అన్వేషణ ఎందుకు? ఇప్పుడు ఇంటివద్ద ఏమి అనుకుంటూ ఉంటారో నిస్సహాయత, పలు ఆలోచనలు. ఎక్కడో ఒక మూల పట్టుదల ఎలాగైనా వెతకాలని ఈ ఏరియాకు వచ్చాము. గురువుగారు హృదయాంతరస్థులు, ఆయనకు అంతా తెలుసు, ఆయనను తప్పకుండా దర్శించుకుంటామన్న ఆశ. శ్రీనివాసస్వామి (గురువు) పిఎ చెప్పిన ఏరియాకు వచ్చాము. భోజనం చేయాలనిపించలేదు. సరే ముగ్గురం విడివిడిగా వెతకాలి అని నిర్ణయించుకుని ఒక అతన్ని ఒక వైపు, మేము ఇద్దరం ఒకవైపు వెళ్లాము. చాలా దూరం తిరిగాము. నా ఫ్రెండ్‌కి ఓపిక పోయింది. ఒక్కసారిగా ఇసుకలో కూర్చుండిపోయాడు. నేను అతనివైపు చూచి ప్రక్కన కూర్చున్నాను. గురువుగారు నాకిచ్చిన అనుభవాన్ని శరణుజొచ్చాను. చివరగా అతనితో చెప్పాను. ఆ బిల్డింగ్ వరకు వెళ్లి చూసి వస్తాము అని నా మనస్సు ఆవైపు లాగుతోంది. అతను చెప్పాడు– "నేను ఇక్కడే ఉంటాను, నీవు వెళ్లి చూసిరా" అని. నేను అక్కడి వరకూ వెళ్లి వచ్చాను. మరలా గురువుగారిని ప్రార్థించుకున్నాము. ఒక స్ఫురణ కలిగింది. తిరువణ్ణామలైకి ఫోన్ చేసి యస్‌టిడి అబ్బాయిని అడ్రస్ గురించి అడగాలని. అయితే! తెలుగు, తమిళం తెలిసిన అబ్బాయి దొరకాలి. అతనికి విషయం చెప్పి అడ్రస్ అడిగించాలని. బీచ్ దగ్గర



నుండి రోడ్ మీదకు వచ్చాము. అతన్ని యస్.టి.డి. ఎక్కడ ఉంది అని అడిగితే అతను కూడా తెలుగులోనే సమాధానం చెప్పాడు. విచిత్రం 'అతనిది ఏ ఊరు' అని అడిగాము. 'చిత్తూరు' అని చెప్పాడు. అతనితో విషయం చెప్పి, యస్.టి.డి. అతని ఫోన్ నెంబరు ఇచ్చి అడ్రస్ కరెక్టుగా కనుక్కోమని చెప్పాము. మాకు టెన్షన్. అవతల యస్.టి.డి.లో మాకు అడ్రస్ ఇచ్చిన అబ్బాయి ఉన్నాడో, ఇంక ఎవరైనా ఉన్నారో అని? ఇతను అడ్రస్ కనుక్కున్నాడు. ఫోన్ నెంబరు తీసుకున్నాడు. విచిత్రం ఒక్క నంబరు తప్పు ఇచ్చాడు. ఇప్పుడు కరెక్ట్ నెంబరు వచ్చింది. అడ్రస్ కూడా ఆ ఏరియా అతనే కాబట్టి స్పష్టంగా చెప్పాడు. ఇది వరకు మేము అక్కడ వరకు వెళ్లి వచ్చి ఉన్నాము. ఖచ్చితంగా అడ్రస్ ఇదే అన్న విషయం తెలిసిపోయింది. ఆ సంతోషం మాటలలో వర్ణించలేము. మీరే ఊహించవచ్చు. మా ఫ్రెండ్ కోసం ఎదురు చూస్తున్నాము. అతను కిలోమీటరు వరకు వెళ్లాడు. అతని కోసం వెళ్లి అతన్ని తీసుకొని గురువుగారి అడ్రస్ దొరికింది అని చెప్పి అందరం సంతోషంగా తృప్తిగా కూల్‌డ్రింక్స్ త్రాగాము. సంతోషం ఒకవైపు, భయం ఒకవైపు. అయినా గురువుగారు తప్పకుండా చూస్తారు అన్న నిర్భయత్వం ఒకవైపు. బిల్డింగ్ దగ్గరకు వెళ్లాము. బయట కారు ఉంది. దానిలో బాబా ఫోటో, గురువుగారి ఫోటో ఉన్నాయి. నమ్మకం దృఢపడింది. బెస్తవాళ్ల పిల్లలు వచ్చారు. వాళ్లు చెప్పారు. గురువుగారి ఫోటో చూసి వాళ్లు లోపల ఉంటారని. తలుపు వేసి ఉన్నారు. మాకు భయంగా ఉంది. నాకు ఎలా ఉందంటే మనం వెళ్లకుండా అక్కడే దాక్కుని ఉంటే గురువుగారు బయటకు వచ్చినపుడు ఆయనను చూసుకోవచ్చు కదా! అనిపిస్తుంది. అక్కడ పిల్లలు మేము వద్దని వారిస్తున్నా వాళ్లు వెళ్లి తలుపు తట్టారు. పని ఆమె బయటకు వచ్చింది. మేము వెళ్లక తప్పలేదు. మేము గురువుగారికోసం వచ్చామని చెప్పాము. ఆమె లోపలకు వెళ్లింది. పద్మమ్మగారు వచ్చారు. 'మీరు ఎవరు ఎందుకు వచ్చారు' అని అడిగారు. 'మేము గురువుగారిని చూడాలని వచ్చామమ్మా' అని చెప్పాము. 'గురువుగారు ఇక్కడ ఎక్కడ ఉన్నారు? ఆయన ఇక్కడ లేరే' అని చెప్పారు. 'అమ్మా! మీరు అట్లా అనకండి. ఆయన లోపల ఉన్నారు. మేము ఆయనను చూడాలని భోజనం కూడా చేయకుండా తిరుగుతూనే ఉన్నాం.

'తిరువణ్ణామలై వెళ్లి అక్కడ లేకపోతే ఇక్కడకు వచ్చాము' అని విన్నవించుకున్నాము. 'ఆయన పైనుంచి అట్లా చూస్తే చాలు వెళ్లిపోతాము'. ఆ సమయంలో నా పరిస్థితి అలాగే ఉంది. ఆయన కనబడితే చాలు. చూసి తృప్తిగా వెళ్లిపోవచ్చు. నిజంగా ఆ ఇష్టం పైకి తెచ్చుకుంటే వచ్చేది కాదు. నాకు అంత ఇష్టం ఆయనపైన, ఆయనను చూడాలని ఎందుకు పుట్టిందోనాకే తెలియదు. అయితే ఆ పట్టుదల ఇచ్చింది మాత్రం ఆయనే. లేకపోతే నాకు అంత పట్టుదల ఎక్కడిది? సంస్కారవంతులు సంస్కార వంతులే. ఆమె మా మొర అర్థం చేసుకొని "బయట అక్కడ నిలబడండి" అని చెప్పారు. మేము బయటకు



వచ్చి చెప్పులు తీసివేసి ఆ బిల్డింగ్ వైపు నమస్కారం చేస్తూ చూస్తున్నాము. బెస్తవాళ్ల పిల్లలు మా ప్రవర్తనకు ఆశ్చర్యపోయి మా వైపు, బిల్డింగ్‌వైపు చూస్తున్నారు. గురువుగారు పైన వచ్చి చూస్తారని ఆత్రుతగా ఉన్నాము. ఇంతలో క్రింద తలుపు తీసుకుని నరేంద్రసార్ వచ్చారు. మమ్మల్ని చూస్తూనే "ఎవరయ్యా! మీరు? అని అడిగారు. "సార్! మాది వెంకటగిరి. గురువుగారిని చూడాలని వచ్చాము" అని చెప్పాము. "అసలు ఇక్కడకు ఎలా వచ్చారు? ఇక్కడ గురువుగారు ఉన్నారని మీకు ఎలా తెలిసింది? ఎవరు చెప్పారు?" అని అడిగారు. "సార్! గురువుగారిని చూడాలని తిరువణ్ణామలై వెళ్లాము. అక్కడ లేరు. అక్కడ ఒక యస్.టి.డి. అబ్బాయి అడ్రస్ చెప్పి, ఫోన్ నెంబరు ఇచ్చాడు. బయలుదేరి రెండు రోజులు అయ్యింది. అడ్రస్ కోసం తిరిగి తిరిగి చివరకు ఎంతో శ్రమపడి వచ్చాము" అని చెప్పాము. ముగ్గురి పేర్లు అడిగారు, చెప్పాము. 'మీరు గురువుగారిని చూసారా' అని అడిగిన ఆయనకు శిరిడీలో చూసామని చెప్పాము. బాబాతో ఉన్న అటాచ్‌మెంట్ గురించి, తరువాత గురువుగారి దగ్గరకు వచ్చిన విధానము అన్ని విషయములు అడిగి తెలుసుకున్నారు. నేను చెప్పాను. "సరే నిజంగా మీరు ఇంతదూరం గురువుగారిని చూడాలని బయలుదేరి రావడం ఇంత రిస్క్ తీసుకోవడం నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ అడ్రస్ ఎవ్వరికీ తెలియదు. ఇక్కడకు రావడం చాలా కష్టం. ఇక్కడకు ఎవ్వరూ రారు, రాకూడదు". "అన్నా! మాకు తెలియదు, గురువుగారిని చూడాలని వచ్చాము. ఇంక ఎప్పుడూ రాము. గురువుగారిని అలా చూసి వెళ్లిపోతాం. "మీరు నిజంగా ఇంత ఇదిగా గురువుగారిని చూడాలని రావడం నాకు చాలా సంతోషంగా ఉంది. అయితే ఇక్కడ గురువుగారి దర్శనాలుండవు. ఇక్కడ చాలా కష్టం. అందులో గురువుగారు బయటకు వచ్చి మూడు రోజులయ్యింది. భోజనానికి కూడా బయటకు రావడం లేదు. అప్పుడు బాబా చేస్తున్నదే ఇప్పుడు గురువుగారు చేస్తున్నారు. ఆయనకు అసౌకర్యము కలిగించకూడదు కాబట్టి ఆయన దర్శనం గురించి ఆశ పెట్టుకోకండి. సరే అక్కడ కూర్చోండి" అని చెప్పి ఆయన లోపలకు వెళ్లారు. మేము సముద్రం ఒడ్డున కూర్చున్నాం. వర్ణించనలవి కాని సంతోషం. నరేంద్రన్న మాతో మాట్లాడారు. ఆయన మాట్లాడిన విధానం, ఆయన సంతోషపడిన విధానం ఆయన మా బాధను అర్థం చేసుకున్న తీరు బాగా నచ్చాయి. గురుదేవుల దగ్గర ఉండగలగడం అంటే ఆయన సామాన్యులు కాదు కదా! మేము గురువుగారిని, బాబాని ప్రార్థించుకుంటూ దర్శనం ఇస్తారన్న నమ్మకం కూడా లోపల ఉంది. నరేంద్రన్న కొద్దిసేపటి తరువాత తలుపు తెరచుకుని బయటకు వచ్చారు. తలుపువైపే చూస్తున్న మేము పైకి లేచి నమస్కారం చేస్తూ పరిగెత్తుకుంటూ ఎదురు వెళ్లాము. ఆయన మాతో "వెళ్లి భోజనం చేసి రండి! ఇక్కడ దగ్గరలో సాయిబాబా గుడి ఉంది. వెళ్లి దర్శనం చేసుకోండి. బట్టలు బాగా మురికిగా ఉన్నాయి కదా! వెళ్లి సముద్రంలో స్నానం చేసి 7 గం॥ల ప్రాంతంలో ఇక్కడకు రండి. లోపల ఇంగ్లీషువారు కొంతమంది



భజన చేస్తారు. అక్కడ భజన చేసుకోవచ్చు. గురువుగారి దర్శనాలు మాత్రం ఉంటాయని అనుకోకండి." అని చెప్పారు. చెప్పలేని సంతోషంతో ఆయనకు మనస్సులోనే కృతజ్ఞతలు తెలుపుతూ సముద్రంలోనికి వెళ్లాము. సముద్రంలో స్నానం చేస్తుంటే కొద్దిగా వర్షం మొదలయ్యింది. స్నానం చేసి రోడ్డు పైకి వచ్చి, హోటల్‌లో భోజనం చేసాము. టైం సాయంత్రం 6 గం॥లు. బట్టలు బాగా తడిసిపోయాయి. తుఫాన్‌లాగా వర్షం ఆగకుండా పడుతుంది. కటిక చీకటి, "అబ్బా! గురువుగారి దర్శనానికి ఎన్ని అడ్డంకులు" అని అనుకున్నాను. ఎంత వర్షము వచ్చినా ఊరు కొట్టుకుపోయినా, గురువుగారి దర్శనానికి వెళ్లకుండా ఉండేది లేదు కదా! ఆశ్చర్యంగా సరిగ్గా 6 గం॥లకు వర్షం ఆగింది. చాలా చీకటిగా ఉంది. మేము వెళ్లాము. నరేంద్రగారు మాతో "బాబా ఫోటో దగ్గర భజన చేసుకోండి. ఇంత దూరం రావడం కష్టం. వచ్చినా లోపలకు అనుమతి ఉండదు. మీరు లోపలకు రాగలిగారు. గురువుగారు పైన ఉన్నారు. ఆయన సన్నిధిలో మీరు ఉన్నారు. అంతకంటే ఏం కావాలి? గురువుగారు బయటకు వచ్చి మూడు రోజులు అయ్యింది. భోజనానికి కూడా బయటకు రావడం లేదు. వర్షం పడుతోంది. వర్షం పడితే సహజంగా ఆయన బయటకు రారు. గురువుగారు రాలేదని బాధపడకండి. గురువుగారు వస్తే దర్శనం చేసుకుంటాము. రాకపోతే దాని గురించి బాధపడనవసరం లేదు. ఎందుకంటే ఆయన సన్నిధిలో గడిపే అదృష్టం చాలు కదా"! అని మరలా చెప్పారు. "సరే అన్నా" అని వెళ్లి మేము సాయి సంకీర్తనలో పాల్గొన్నాము. అక్కడ ఇంగ్లీషు వాళ్ల మధ్యలో బట్టలు తడిసిపోయి ముద్ద ముద్దగా నీళ్లు కారుతూ హంసల మధ్యలో కాకులలాగ మేము ఉన్నాము. సాయిబాబా నామం భజన చేస్తూ, బాబాని తీవ్రంగా ప్రార్థించుకుంటున్నాము. దర్శనం ఇప్పించమని ఎంత ఆందోళనగా ఉందో అంత నమ్మకం ఉంది, దర్శనం అవుతుందని- ఎందుకంటే ఆయన ప్రేమమయుడు. అంత దూరం మేము రాగలిగేటట్లు దయచూపించిన ఆయన దర్శనం ఇవ్వకుండా ఉంటారా? జరిగిపోయింది కాబట్టి ఇప్పుడు మాట్లాడుతున్నాను. గర్వం వచ్చేసింది కదూ! అవును అప్పుడు మాత్రం టెన్షన్ ఉన్నది, ఎట్టకేలకు నరేంద్రసార్ వచ్చి ఆదుర్దాగా అందరికీ ఫోన్స్ చేస్తున్నారు. ఆరతి అయ్యింది. కొంత సేపు అయిన తరువాత రెడ్ చెయిర్ తీసుకుని వచ్చి వేస్తున్నారు. కొంత అర్ధమవుతున్నా భయంగా, ఆనందంగా ఉంది. ముఖ్యమైన గురుబంధువులు బహుశా నరేంద్రసార్ ఫోన్ చేసిన వాళ్లు చేరుకున్నారు. గురువుగారి దర్శనం కోసం చూస్తున్నాము. గురువుగారు మేడ మెట్లు దిగుతున్నారు. ఇంగ్లీష్ వాళ్ల పాప గురువుగారిని చూడడం, "గురూజీ" అని ముద్దుగా పిలిచింది. గురువుగారు నవ్వారు. నిజంగా ఆ నవ్వు నా కళ్లలో ఇప్పటికీ మెదులుతుంది. బాబా నవ్వు చూడడానికి ఎన్ని జన్మలైనా వేచి ఉండవచ్చు అన్న కపర్దే మాటలు నాకు అనుభవానికి వచ్చాయి. కపర్దే సత్యమే చెప్పారు. సద్గురువు నవ్వులో ఉన్న మాధుర్యం నేను చవిచూసాను. గురువుగారు వచ్చి రెడ్ చెయిర్‌లో కూర్చున్నారు. గురువుగారి



చెయిర్‌కి దగ్గరగా నేరుగా మేము కూర్చున్నాము. గురువుగారు తల ఎత్తి మావైపు చూసారు. ఆ చూపు కోసమే ఎదురు చూస్తున్న మేము ఎవరెవరికి ఎంత ఆతృత వున్నదో అంతా, ఆ చూపునుంచి అనుగ్రహాన్ని ఆస్వాదించాము. నిజంగా గురువుగారి చూపు ఎంత తీక్షణంగా ఉన్నదంటే మాటలలో వర్ణించలేము. ఆ చూపు తీక్షణతను తట్టుకోలేక మా స్నేహితులు రెండుసార్లు తలలు వంచారంటే ఆయన ఎంత తీక్షణంగా చూసి ఉంటారో అర్థం చేసుకోవచ్చు. గురువుగారు ఇంక ఏవైపు తల తిప్పలేదు. నరేంద్ర సార్ మా వెనుకాలే అదే వరుసలో కూర్చున్నారు అని మా స్నేహితులు చెప్పారు. నరేంద్రసార్ చేతులు ఎత్తి గురువుగారు చూసిన ఆ తీక్షణమైన చూపుకి నమస్కారం చేశారట. విష్ణువు లీలలు ఎప్పుడూ అంటి పెట్టుకుని ఉండే గరుత్మంతుడికే అర్థం కానట్టు, గురువుగారి విషయాలు అర్థం కావు. గురువుగారు హృదయాంతర్వర్తి. ఇప్పుడు పర్సనల్ దర్శనం. నేను ఆనందంతో ఉబ్బితబ్బిబ్బైపోతున్నాను. ఆ ఆనందంలో నాకు ఏమి అర్థం కావడం లేదు. ఎన్నో సంవత్సరాల తరువాత తండ్రిని చూసిన బిడ్డ ఏ విధంగా ప్రవర్తిస్తాడో, ఈ వర్ణన కూడా సరిపోదు. అప్పుడు నేను అనుభవించిన పరిస్థితిని మాటలు వర్ణించలేవు. కలంకు రాసే అర్హత అంతకంటే లేదు. నా మనసులో మాట కొద్దిగా కూడా దాచిపెట్టుకోకుండా ఆయనకొక్కరికే చెప్పగలిగే స్వేచ్ఛా నిర్భయత్వం. నా భారం అంతా ఆయనపై పెట్టి నేను దింపుకోవచ్చు అన్న పట్టరాని సంతోషం. "గురువుగారూ! మీరే నా గురువు. ఆ విషయం మీరే తెలియచేసారు. నేను ఏమి చేస్తున్నానో నాకే తెలియని ఆనందంలో చెప్పుకుంటూ వెళ్లిపోతున్నాను. గురువుగారూ! మీరు నాకు ఆనందాన్నిచ్చారు. అయితే ఆ ఆనందంలో ఎక్కువగా ఉండలేక పోతున్నాను. దానికి కారణం నాకు సరైన బ్రతుకుతెరువు లేదు. దయచేసి మీ దయతో నాకు ఒక మంచి బ్రతుకుతెరువు ఇప్పించండి. నేను మీపైన పూర్తిగా ఆధారపడి బతికేటట్టు ఆశీర్వదించండి". గురువుగారు "శుభం జరుగుతుంది" అంటూ ఊదీపెట్టి, చేతికిచ్చారు. గుడ్‌డే బిస్కెట్ ప్యాకెట్ ఇచ్చి, ఆ రోజుని నా జీవితంలో మరచిపోలేని గుడ్‌డేగా మిగిల్చారు. మా స్నేహితులకు ఇంక అక్కడ ఉన్న వారికి పర్సనల్ దర్శనాలు జరిగిన తరువాత గురువుగారు మేడపైకి వెళ్లిపోయారు. మేము క్రింద హాలులో కూర్చుని ఉన్నాము. ఆ ప్రదేశం వదలి బయటకు పోవాలని లేదు. దానికి తగినట్లు వరుణుడు మాకు సహాయం చేసాడు. వర్షం మరలా ప్రారంభమై, విపరీతంగా పడసాగింది. "ఎంత పడితే అంత మంచిది" అని నేను అనుకున్నాను. పైన గురుదేవులు, క్రింద మేము వర్షం ఉరుములు, మెరుపులు వాతావరణం ఎంతో ఆహ్లాదాన్ని, హాయిని పంచింది. క్రింద రూమ్‌లో నరేంద్రసార్ విశ్రాంతి తీసుకుంటూ ఉన్నట్లుగా ఉంది. ఫారినర్ ఒకరు వచ్చి నరేంద్రసార్‌ని గురువుగారు పిలుస్తున్నారు అని చెప్పినట్లుంది. ఒక్క ఉదుటున లేచి మేడ పైకి పరిగెత్తారు. తరువాత గురుబంధువు సుబ్బారావుగారి కుమార్తె రాధ వచ్చి, ప్లేట్స్‌తో భోజనాలు తీసుకువచ్చింది. మా



ముగ్గురిని భోజనం చేయమని చెప్పింది. మాకు మొహమాటం మరియు సంతోషం. వద్దమ్మా అని చెప్పాము. గురువుగారు నాకు చెప్పారు. మీకు భోజనం పెట్టమని, ఆయన చెప్పిన పని నేను చేస్తున్నాను. నాకు చాలా సంతోషంగా ఉంది. అని మేము తింటూ ఉంటే చెప్పింది. మాకు కళ్లలో నీళ్లు తిరిగాయి. ఎందుకూ పనికిరాని మాకు, ఏ అర్హతా లేని మాకు దర్శనం ఇవ్వడమే కాకుండా భోజనం పెట్టిస్తున్నారు. ఆ అమ్మాయి గురుబంధువులు పట్ల చూపిన ప్రేమ, వడ్డించిన విధానం, ఆప్యాయత, గురువుగారు చెప్పిన పని శ్రద్ధగా చేయడం చూస్తే గురుబంధువుల పట్ల మనం చూపవలసిన ప్రేమ అర్థం అవుతుంది. నరేంద్ర సార్ మేడ దిగి క్రిందికి వచ్చారు. మమ్మల్ని పిలిచారు. మేము వెళ్లాము. "మీరు ఇప్పుడు ఎక్కడకు వెళ్లాలి?" అని అడిగారు. "మేము వెంకటగిరి వెళ్లాలి" అని చెప్పాము. "అన్నా ఎట్లా వెళ్లాలో తెలియదు. బస్టాండ్ ఎక్కడ ఉందో తెలియదు, వర్షం పడుతోంది. ఉదయం వెళ్తాము అన్నా" అని చెప్పాము. "అన్నా మాకు వెళ్లాలని లేదు" అని నేను చెప్పాను. అప్పుడు ఆయన మాట్లాడిన విధానం ఎంతో నచ్చింది. "ఉండే రోజులు ముందున్నాయిలే! మీకు ఇంకేం కావాలి. మీకు అన్నీ జరిగాయి. మిమ్మల్ని చూస్తుంటే నాకు చాలా సంతోషంగా ఉంది. గురువుగారు దర్శనం ఇచ్చారు, ఊదీ పెట్టారు, ఊదీ ఇచ్చారు, మాట్లాడారు, బిస్కట్‌ప్యాకెట్ ఇచ్చారు, భోజనం పెట్టించారు. ఇంక సంతోషంగా వెళ్లండి. ఇప్పుడు సుబ్బారావుగారు జీపులో మిమ్మల్ని బస్టాండ్‌లో దింపుతారు" అని చెప్పారు. మారు మాట్లాడకుండా నరేంద్రసార్‌కి నమస్కారం మరియు కృతజ్ఞతలు తెలుపుకుని సంతోషంతో బయలుదేరాము. ఈ సంఘటన మా ముగ్గురిలో ఒక మార్పుకి దోహదపడింది. మా ఫ్రెండ్ శ్రీను చెప్పాడు నాతో అన్నా ఈరోజు నేను దేవుడ్ని చూసాను. మా ఫ్రెండ్ ఫయాజ్ చెప్పాడు, గురువుగారు తీక్షణంగా చూసినపుడు లోపల హృదయంలో ఒక విద్యుత్ షాక్‌లాగా తగిలింది. భయం- ఆనందాన్ని కలిగించిందని. ఈ సంఘటన జరిగిన 10 రోజుల తరువాత నరేంద్రన్న మా ఫ్రెండ్ గోపాలకృష్ణకి ఫోన్ చేసి చెప్పారట, మీ ఊరినుండి ముగ్గురు గురువుగారిని చూడాలని వచ్చారు అని. అన్ని విషయాలు చెపుతూ గురువుగారికోసం, మా కోసం చేసుకున్న భోజనం గురువుగారు పెట్టించారని, అందరిపట్ల గురువుగారికున్న ప్రేమ, దయ, కరుణ, జాలి మాకు మరొకమారు అర్థమయి, కళ్లు ఆనందంతో చెమ్మగిల్లాయి.

**-గురుబంధువు**

**సద్గురు తత్త్వ దర్శిని : www.gurukrupa.info**

**సాయి సమగ్రదర్శిని : www.saibaba.com**

**గురుబంధువులు తమ అనుభవాలను పంపవలసిన** mail ID : **gurukrupa@saimail.com**



# చక్కటి కూర్పు... సద్గురువుది నేర్పు

సద్గురు పాదపద్మములకు శిరస్సు వంచి నమస్కరించి, సద్గురు అనుగ్రహం మా మీద వర్షిస్తున్న తీరును, ఆ అనుగ్రహధారలోని కొన్ని ఆనందమైన క్షణాలను మీతో పంచుకుంటాను. నా పేరు సాయిసుధ. నేను మా అమ్మ, నాన్నలకు చిన్న కూతురిని. నేను మూడవ సం॥ ఇంజనీరింగ్ చేస్తుండగా మా అమ్మగారు చనిపోయారు. నా వివాహం గురించి నాన్నగారు చాలా ఆలోచిస్తూ ఉండేవారు. నేను కొంచెం మొండిగా ఉంటాను. నాకేదైనా కావాలనిపిస్తే అది సాధించుకునే వరకు ఊరుకోను. ఎట్టి పరిస్థితులలోను రాజీ పడను. బాబా, గురువుగారు నాకుండగా నేను ఎందుకు రాజీ పడాలని నా భావన. నా వివాహ విషయంలో బంధువులంతా నాన్న చెప్పినట్లు వివాహం చేసుకొమ్మని అదే నాకు మంచిదని చెప్పేవారు. అయితే నా భావన మాత్రం నాలో 'సగమయ్యే' అబ్బాయికి బాబాపట్ల, గురుదేవుల పల్ల ప్రేమ ఉండాలని, 'సద్గురువుకు ఎలా దగ్గరవ్వాలని' ఆలోచించేవాడుగా ఉండాలని కోరిక. రెండు సం॥లు వేచి ఉన్నాను.ప్రేమతో నాన్న, బాధ్యతతో బంధువులు త్వరగా వివాహం చేసుకొమ్మని బలవంతం చేస్తుండేవారు. నాకు అనిపించేది నేను బాగా స్వార్ధంగా నా గురించే ఆలోచించుకుంటున్నానా? అని! అయినా రాజీ పడలేదు. ఆగస్ట్ 2007వ సం॥లో కోట విజయభాస్కర్ అంకుల్ నన్ను, నాన్నను బాబా మందిరానికి వచ్చి సాయి అన్నప్రసాదాన్ని తీసుకువెళ్లమని చెప్పారు. నాకు సాయి పిలుపుగా అవగతమయ్యింది. కానీ, నాన్న మాత్రం భాస్కర్ అంకుల్ నాకు ఏదో సంబంధం చూస్తున్నారనుకున్నారు. భాస్కర్ అంకుల్ వచ్చిన తరువాత నాన్నకు అర్ధమయ్యింది. ఈ సందర్భం నా వివాహం గురించి కాదని! నాన్న స్థితి చూసి నాకు చాలా కష్టమనిపించింది. నాన్నకు నామీద బాగా కోపం వచ్చింది. నాన్న, నా వివాహం విషయంలో నా మొండితనం గురించి ఆంటీకి కంప్లైంట్ చేసారు. కానీ ఆంటీ మాత్రం నాతో "బాబా చిత్రపటం ముందు కూర్చుని గురువుగారికి నీకు ఏది కావాలో అది వ్రాసి పెట్టమని" చెప్పారు. నేను గురుదేవులకు ఇట్లా వ్రాసుకున్నాను "బాబా, గురూజీ నా చివరి క్షణాలన్నా రావాలి. లేదా నా భర్తతో కలిసి మీ ఆలోచనలలో అయినా గడపాలి, ఎందుకంటే నాకు నాకుగా నేర్చుకునేంత అర్హత లేదు కనుక నేను తన ద్వారా మీ ఊసులో గడపాలనుకుంటున్నాను. ఇలా కోరుకోవడం మొండితనమని అనుకున్నా నాకు మాత్రం అదే కావాలి". డిసెంబర్ 2007లో మా నాన్న, బంధువులంతా వివాహం చేసుకోమని బాగా ఒత్తిడి చేసారు. గురుదేవుల చిత్రపటం చెంత కన్నీళ్లు పెట్టుకుని, నరేంద్రన్నకు మెయిల్ పెట్టాను. "అన్నా! నాకు వివాహం చేసుకోవాలని లేదు. నేను ఇలా ఒంటరిగా ఉండిపోతాను. అందుకు గురుదేవుల ఆశీస్సులు కావాలి. మెయిల్ పంపిన రోజు రాత్రి నాకు ఒక కల వచ్చింది. నా జీవితం ఒక కొత్త మలుపు తిరిగింది. ఇలా సాగింది ఆ కల... "అదొక గెస్ట్ హౌస్ – క్రింద ఒక టెంట్‌లో సాయిబాబా నామస్మరణ చక్కగా సాగుతోంది. ఒక ఇరవైమంది గురుబంధువులు ఉన్నారు. ఇంతలో ఒకరు వచ్చి చెప్పారు. గురువుగారు క్రిందకు వస్తున్నారని! అందరం లైన్లో నిల్చున్నాం. ముందు లైన్లో నేను, వారి పాద పద్మములకు నమస్కరించి కోవాలని. గురువుగారు వచ్చారు. దప్పికతో తపించిన పక్షిలా ఆ అనుగ్రహ జలధారకు శిరస్సు వంచి నమస్కరించాను. అక్కడున్న ఇరవైమంది గురుబంధువులు కలసి రాత్రికి బాబా నామం చెప్పుకున్నారు. వారి ఊదీ దర్శనానికై క్యూలో నిలబడమని చెప్పారు. కొంత సమయం క్యూలో ఉన్న తరువాత గురువుగారి



గదిలోనికి వచ్చి చూసాను. చిన్న, తెల్ల చలువరాళ్లు పరచిన గది, ఆ గదిలో వారు సహజంగా కూర్చునే తెల్లని వస్త్రం పరచిన కుర్చీ, అనుగ్రహ ఆశీస్సులకై ఊదీ,. నేను ఆ గది తలుపు దగ్గరకు చేరాను. గురుదేవులు నావంక చూసి పరిహాసంగా నవ్వారు. నాకు అర్థం కాలేదు. నన్ను చూసి వారికంత హాస్యం ఎందుకు అనిపించిందో! కానీ నన్ను చూసి అలా నవ్వారు కనుక, నాతో మాట్లాడతారని సంతోషమనిపించింది. ఇక నా వంతు వచ్చింది. అప్పటి వరకు గురువుగారు నన్ను చూసి అలా నవ్వుతూనే ఉన్నారు. వారి పాదాలపై పడి చాలాసేపు విడిచిపెట్టలేదు, నాకు ఊదీ ఇస్తూ కూడా నవ్వుతూనే ఉన్నారు. వారు ఊదీ ఇస్తూ ఇలా అన్నారు "నువ్వు విమానంలో వెళుతూ, రాకెట్ అంత స్పీడ్‌లో పైకి వెళ్లాలనుకుంటున్నావు" అని. గురువుగారి మాటలు నాకు అర్థం కాలేదు. జనవరి 2008 నూతన సంవత్సరానికి నేను శిరిడీ వెళ్లలేదు. నూతన సంవత్సరం మొదటి గురువారం నాకు నారాయణరావు అంకుల్ నుంచి ఫోన్ వచ్చింది. ఒక గురుబంధువు వివాహ సంబంధం గురించి చెప్పారు. నాకు బాబా ఏదో ఇద్దామని అనుకుంటున్నారనిపించి సరే అన్నాను అంకుల్‌తో. తర్వాత రోజు నాకు ఒక ఫోన్ వచ్చింది ఒకరినుంచి. తనను వివాహం చేసుకోవడంలో నా అభిప్రాయం, కోరిక ఏమిటని? తనతో గురుదేవుల ఆశీస్సులకై వేచి చూద్దామని చెప్పాను. తను నన్ను కలవడానికి రాబోయే శుక్రవారం వస్తానని చెప్పారు. అన్ని ఏర్పాట్లు బాబా చేస్తుండడంతో నేను -అన్నీ ఆయనకే వదిలిపెట్టాను. ఇంతకీ తన పేరు చెప్పలేదు కదూ! రఘు. మా పెద్దల అంగీకారంతో మా నిశ్చితార్థం మా ఇంట్లో కానీ, చెన్నై సత్సంగ కేంద్రంలో కానీ చేద్దామనుకున్నారు. నాకు, రఘుకు అది కూడా గురువుగారి చేతుల మీదుగా జరగాలని ఆశ. సాయి సంకల్పానికి మా ఆశ తోడయ్యి, పూజ్యశ్రీ బాబూజీ చేతుల మీదుగా మా నిశ్చితార్థం తిరువణ్ణామలైలో జరిగింది. 27 మే 2008 సం॥ మా వివాహం పూజ్యశ్రీ బాబూజీ చేతుల మీదుగా ప్రేమ నిండిన పథం - సాయిపథ ప్రాంగణంలో కన్నులపండుగగా జరిగింది. బాబా, గురుదేవులు నాకు జత చేసిన మంచి బంధం... రఘు... తన చక్కని కుటుంబం, వారికి నాపై ఉన్న ప్రేమ.... మాటల్లో కష్టం. ఒక్కసారి వెనక్కు వెళ్తే సాయిమెయిల్‌లో(Saimail) మందిరాల గురించి, సత్సంగాల ఫోటోలు, సత్సంగ సమయాలు అందరితో పాటు నాకు వస్తుండేవి. వాటిలో పరకాల మందిరం ఫొటోలు చూసినపుడు గురుదేవులతో చెప్పుకున్నాను, నాకు ఇలా బాబా పట్ల ప్రేమ, ఆసక్తి ఉన్న భర్తను ఇవ్వమని. మా నిశ్చితార్థం అయ్యాక నా పాత మెయిల్స్ చూసుకుంటే తెలిసింది కేవలం నాకు తన మెయిల్ ఐడి ద్వారానే తెలిసిన రఘు నాకు భర్త కాబోతున్నాడని. నేను తనను డిడి కాలనీ సత్సంగ కేంద్రంలో ఆరతి ఇస్తుండగా ఉన్న ఫొటోలో మొదటిసారి చూసాను. ఇలా ప్రతీ సంఘటనను ఒక చక్కటి కూర్పుగా ఏర్పాటు చేసారు పూజ్యశ్రీబాబూజీ. పూనే నుంచి నా వివాహానికి శిరిడీకి బయలుదేరిన మా వాహనాన్ని నడిపే డ్రైవర్ తాగి ఉన్నాడు. రోడ్డు ప్రక్కన త్రవ్వి వున్న గుంటను, అక్కడ ఉన్న బురదను గమనించకపోవడంతో పెద్ద ప్రమాదమే జరిగేది. అందరూ బిగ్గరగా "బాబా" అని పిలిచాము, రక్షింపబడ్డాము. మా అందరూ ఆడవాళ్లతో మా కజిన్ సుదర్శన్ ఒక్కడే ఉన్నాడు. తను మమ్మల్ని శిరిడీ వరకు డ్రైవ్ చేసి తెచ్చాడు. తను నాతో అన్నాడు "మనల్ని కాపాడింది మీ గురువుగారే! ఈ కొండ వాలు రోడ్లలో నా చేత చక్కగా డ్రైవ్ చేయించింది కూడా మీ గురువుగారే!" అని. ఇలా బాబా, బాబూజీలు తెలియపరుస్తూనే ఉన్నారు - "మీ వెంట మేమున్నామని! కడకు గమ్యం చేరుస్తామని". ఈ ఆనందం సద్గురు ప్రసాదం - మీ అందరితో పంచుకోవడం గురు అనుగ్రహ విశేషం...

**-సుధారఘు, చెన్నై.**

బాబా కేవలం మన కోరికలు తీర్చటం మాత్రమే కాదు, వాటిని ఒక క్రమంలో, చక్కటి సంఘటనల కూర్పుతో మనకు అందించి, మన అంతరంగం వాటి వల్ల సరైన పంథాలో ప్రభావితమయ్యేట్లు కూడా చూస్తారు. ఎవరికి వారు తమతమ అనుభవాలను జాగ్రత్తగా విశ్లేషించి, సమీక్షించుకుంటే, శ్రీసాయి కేవలం 'హర' దైవమే కాదు, 'పర' దైవం కూడానన్న సత్యం బోధపడగలదు. అంతేకాదు, ఇహపరశ్రేయోదాయకమైన సాయిభక్తి 'యోగం' యొక్క అపూర్వ ప్రాశస్త్యం కూడా అవగతం కాగలదు!

– శ్రీ బాబూజీ




When I say it, I mean it.